క్లుప్తంగా


నేడు వేంకటేశ్వరస్వామి కల్యాణం



ముస్తాబైన ఆలయం

చందుర్తి : మండలంలోని మూడపల్లి గ్రామ శివారులోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం బ్రహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ శాశ్వత చైర్మన్ జేపీరావు తెలిపారు. బ్రహోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం వేదపండితుల మంత్రోచ్చారణల స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు అన్నదానంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌లో వచ్చేనెల 5న ఎల్లమ్మ సిద్ధోగ వేడుకలు నిర్వహించనుండగా ఎమ్మెల్యే కేటీఆర్ ఎల్లమ్మ ఆలయం వద్ద హైమాస్ట్ లైట్లు మంజూరు చేశారు. బుధవారం గౌడసంఘం ప్రతినిధి పాముల బాలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేటీఆర్‌కు గౌడ సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు లింగాల నరేందర్‌గౌడ్, మోసుకంటి అంజయ్యగౌడ్,దేవయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో శాంతిహోమం

సిరిసిల్లటౌన్: జిల్లాకేంద్రం గాంధీనగర్ భక్తాంజనేయ రుక్మిణీ విఠలేశ్వర ఆలయ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సుప్రభాత సేవ, ధ్వజారోహణం, అష్టోత్తర శత నామావళి, మహా యజ్ఞం, రుక్మిణీ–విఠలేశ్వర స్వామి కల్యాణోత్సవం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గుండ్లపల్లి నీరజ, మున్సిపల్ మాజీచైర్మన్ ఆడెపు రవీందర్, పట్టణ ప్రముఖులు గుండ్లపెల్లి పూర్ణచందర్, రాపెల్లి లక్ష్మి–దేవదాసు, పాల్గొన్నారు.

వివాహిత మృతికి కారణమైన ఇద్దరి అరెస్టు

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్‌కు చెందిన కొండుగారి లాస్య(25) ఆత్మహత్యకు కారణమైన ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి బుధవారం తెలిపారు. లాస్య ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడగా.. అపస్మారక స్థితిలో ఉన్న లాస్యను సిద్దిపేటలోని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. లాస్యను ఆమె భర్త దేవరాజు, కుటుంబీకులు ప్రవీణ్, అత్తామామలే హత్య చేశారని మృతురాలి తండ్రి నాంపెల్లి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసి లాస్య మరణానికి కారణమైన భర్త దేవరాజు, బావ ప్రవీణ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎల్లారెడ్డిపేట ఎస్సై రమాకాంత్ కోరారు. మండలంలోని పదిరలో బుధవారం రాత్రి పోలీస్ కమ్యూనిటీ మీటింగ్ నిర్వహించారు. ఎస్సై రమాకాంత్ మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని నేరాల నియంత్రణకు సహకరించాలని కోరారు. యువత గుడుంబా, గంజాయి వంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల అభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని కోరారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లడం ఖాయమన్నారు.

ఆదాయం ఫుల్.. సౌకర్యాలు నిల్

- మురికికూపంగా బద్దిపోచమ్మ ఆలయం రోడ్డు, పరిసరాలు
- రూ.కోట్లాదిగా ఆదాయం వస్తున్నా సౌకర్యాలు కరువు
- ఇబ్బందులు పడుతున్న భక్తులు

వేములవాడ: వేములవాడ పట్టణంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామివారి దర్శనానికి భక్తులు నిత్యం వేలాదిగా తరలివస్తుంటారు. రూ.కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా పట్టణంలో కనీస సౌకర్యాలు కరవవుతున్నాయి. నిత్యం వేలాదిగా తరలివచ్చే భక్తులతో పాటు పరిసర మండలాల ప్రజలకు పెద్దసంఖ్యలో వస్తుంటారు. అయితే బద్దిపోచమ్మ ప్రాంతంలోని రోడ్డంతా నిత్యం మురుగునీటితో దుర్గంధంగా మారడంతో అటుగా వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు, భక్తులు ఆరోపిస్తున్నారు. బద్దిపోచమ్మ ఆలయం ముందు అడుగుతీసి అడుగువేయలేని విధంగా మురుగు నిండి ఉంటుందని, దీంతో ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని భక్తులు వాపోతున్నారు. ఇక్కడే కల్లుశాకం, కొబ్బరికాయలు, పూలతోపాటు, చెత్త నిండిపోతున్నా ఆలయ పారిశుధ్య, మున్సిపల్ సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



బద్దిపోచమ్మ ఆలయం ముందు దుర్గంధంగా మారిన రోడ్డు

రద్దీ సమయంలో ఇబ్బంది

భక్తుల రద్దీ సమయంలో సిబ్బంది కొరతతో కాస్త నిర్వహణ కష్టమవుతోంది. ఎప్పటికప్పుడు మురుగునీరు లేకుండా శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇక ముందు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం. – నర్సయ్య, ఆలయ శానిటరీ విభాగం పర్యవేక్షకుడు

దుర్వాసన వస్తోంది



బద్దిపోచమ్మ వీధి అంతా దుర్వాసన వెదజల్లుతోంది. నిత్యం మురుగుతో అవస్థలు పడుతున్నాం. కనీసం శుభ్రత కూడా పాటించడం లేదు. కనిపించడం లేదు. పలుసార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోతోంది.
– కిష్టయ్యగౌడ్, బద్దిపోచమ్మ వీధి

పట్టించుకోవడం లేదు



బద్దిపోచమ్మ ఆలయం వద్ద రోడ్డుపైనే మురుగు నిలుస్తోంది. కనీసం శుభ్రం చే యించడం లేదు. కాళ్లకు చెప్పులు లేకుండా రావడంతో నిత్యం ఇబ్బంది పడుతున్నాం. కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.
– లావణ్య, భక్తురాలు, వరంగల్

మాతృభాషలో ప్రావీణ్యం పెంచుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు మాతృభాషలో ప్రావీణ్యం పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు నీలం శ్రీనివాసులు, దీపిక, అర్జున్, వెంకటేశ్వర్లు, మధురాజేశ్, అఫ్సారి ఉస్మాని, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు తీశారు. సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం పోచమ్మకు బోనాలు తీశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ కేతిరెడ్డి అరుణ, మామిండ్ల రాజు, బోయిని అంజయ్య, పోశయ్య, నరేశ్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్‌మోహన్ రెడ్డి, ఎంసీసీ అధ్యక్షుడు ఫిరోజ్‌పాషా, డీసీసీ కార్యదర్శి తాళ్లపెల్లి ప్రభాకర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ముదిరాజ్ సంఘంసభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

ముస్తాబాద్: ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య అందిస్తున్నామని జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జ్ఞాన చారి అన్నారు. ముస్తాబాద్, పోతుగల్ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సామగ్రిని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విశాలమైన తరగతి గదులు, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్య అందిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలని సూచించారు. ఉన్నత ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ రాజిరెడ్డి, హెచ్ఎంలు రాధాకిషన్‌రావు, రవీందర్, లెక్చరర్లు మురళీ, ప్రవీణ్, రాజు తదితరులున్నారు.



బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న ఆది శ్రీనివాస్

రుద్రంగి(వేములవాడ): ఇటీవల మండలకేంద్రానికి చెందిన చిత్తిపాక నర్సవ్వ, బాస నారాయణ, మహమ్మద్ షరీఫా అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను బుధవారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయనవెంట డీసీసీ కార్యదర్శులు చెలుకల తిరుపతి, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, నాయకులు సంతోష్ రెడ్డి, పరందాము, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో పూజలు

- నేడు విగ్రహ పునర్‌ప్రతిష్ట
- మంత్రి పొన్నం, ఎమ్మెల్యే కేటీఆర్ రాక



ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని నారాయణపూర్ హనుమాన్ ఆలయంలో విగ్రహ పునర్‌ప్రతిష్ట వేడుకల్లో భాగంగా బుధవారం మహాపూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు రాచర్ల రఘురామశర్మ ఆధ్వర్యంలో రెండోరోజు పూజా హవనం, మధ్యాహ్నం మూలమంత్ర హవనం, యజ్ఞం నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో స్వామివారి విగ్రహ పునఃప్రతిష్ఠ కోసం విగ్రహాలను సిద్ధం చేశారు. గురువారం పునఃప్రతిష్ఠ కార్యక్రమం ఉండగా మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే కేటీఆర్ హాజరుకానున్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. స్వామివారిని జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, మాజీ సర్పంచులు నిమ్మ లక్ష్మి, దొమ్మాటి నర్సయ్య దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు లద్దునూరి హన్మాండ్లు, నిమ్మ సుధాకర్‌రెడ్డి, శ్రీధర్, లింగాల నర్సయ్య, మల్లారెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు చైర్మన్‌కు అభినందనలు



అజ్మతుల్లా హుస్సేన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న చీటి ఉమేశ్ రావు



పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్రవీణ్

సిరిసిల్లటౌన్: తెలంగాణ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్‌ను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ అధికార ప్రతినిధి చీటి ఉమేశ్‌రావు బుధవారం కలిశారు. హైదరాబాద్‌లో ఆయన నివాసంలో కలిసి పదవీ బాధ్యతలు చేపట్టిన అజ్మతుల్లా హుస్సేన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు జిల్లాకు చెందిన ఎడ్మల భూపాల్‌రెడ్డి, ఓరుగంటి తిరుపతి, ఆసరి బాల్‌రాజు, కూతూరు వెంకట్ రెడ్డి, కటుకం రాజశేఖర్, మల్లేశ్‌బాబు, నాగరాజు, మహిపాల్, కిషన్, మల్లేశం తదితరులున్నారు.

పుష్పగుచ్ఛం అందజేత

గంభీరావుపేట: రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన మండలకేంద్రానికి చెందిన సయ్యద్ అజ్మతుల్లా హుస్సేన్‌ను టీఆర్ఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ కూడెల్లి ప్రవీణ్ బుధవారం హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అజ్మత్‌కు ఉన్నత పదవి రావడం పట్ల ప్రవీణ్ హర్షం వ్యక్తంచేశారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

కోనరావుపేట: మండలంలోని కొండాపూర్‌కు చెందిన బీజేపీ కార్యకర్త ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబానికి కనగర్తి శాఖ ఆధ్వర్యంలో రూ.10వేలు, బియ్యం ఆర్థికసాయంగా అందించారు. కార్యక్రమంలో గొట్టె రామచంద్రం, పోగుల లచ్చిరెడ్డి, బెంద్రం శ్రీనివాస్ రెడ్డి, రావులపెల్లి, గంగారెడ్డి, దొడ్డ రాజిరెడ్డి, బిక్కుమల్ల సంతోష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు



సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొన్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ క్యాతం సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో సెకండియర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి వాసరవేని పర్శరాములు, చంద్రమౌళి, భూమక్క, విష్ణు ప్రసాద్, విమల్ కుమార్ తదితరులు ప్రసంగించారు.

సిరిసిల్లటౌన్: పట్టణంలోని వివేకానంద విద్యానికేతన్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలను బుధవారం నిర్వహించారు. చిన్నారులు వివిధ వేషధారణలతో ఆటపాటలతో అలరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా విద్యాధికారి రమేశ్ కుమార్, ఎంఈవో దూస రఘుపతి హాజరయ్యారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. పాఠశాల కరస్పాండెంట్ దిడ్డి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ బుచ్చారావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాలీ ఆటో ఢీకొని ఒకరి దుర్మరణం

- మరొకరి పరిస్థితి విషమం

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని నామాపూర్ వద్ద బుధవారం రాత్రి ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతిచెందగా.. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు. గంభీరావుపేట మండలం లింగన్నపేటకు చెందిన దమ్మన్నపేట నర్సింలు(51), వరుసకు సోదరుడైన దమ్మన్నపేట దేవయ్య(45) ముస్తాబాద్ నుంచి లింగన్నపేటకు బైక్‌పై బయలుదేరారు. చిప్పలపల్లి వైపు నుంచి తుర్కపల్లి వెళ్తున్న ట్రాలీ ఆటో వీరి బైక్‌ను నామాపూర్ వద్ద ఢీకొట్టింది. ఈ సంఘటనలో నర్సింలు, దేవయ్య తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై శేఖర్‌రెడ్డి క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నర్సింలు మృతిచెందగా.. దేవయ్య అపస్మారక స్థితిలో ఉన్నాడు. దేవయ్య కుడి కాలు, చేతు విరిగాయి. కూలీ పనులు చేస్తూ భార్య, నలుగురు కూతుళ్లను పోషిస్తున్న నర్సింలు మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కుటుంబ పెద్ద మృతిచెందడంతో వారు దిక్కులేని వారయ్యారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



నర్సింలు మృతదేహం



చికిత్స పొందుతున్న దేవయ్య

వృద్ధులకు చేతి కర్రలు పంపిణీ



చేతి కర్రలు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయం ప్రాంతంలో వృద్ధులకు మై వేములవాడ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం చేతి కర్రలు పంపిణీ చేశారు. ట్రస్టు సభ్యులు మధు మహేశ్, ప్రతాప నటరార్, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, చల్లా సత్తయ్య, వీరగొని ఆంజనేయులు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీపై వీగిన అవిశ్వాసం

- 11 మంది ఎంపీటీసీలు గైర్హాజరు



సమావేశానికి హాజరైన ఆర్డీవో ఎంపీడీవో

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్‌పై ఆరుగురు ఎంపీటీసీలు ప్రకటించిన అవిశ్వాసం వీగిపోయినట్లు వేములవాడ ఆర్డీవో పులి మధుసూదన్ బుధవారం తెలిపారు. మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో ఆర్డీఓ ఎంపీడీఓ జయశీల సమక్షంలో ఎంపీటీసీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీటీసీలు ఎవరూ సమావేశానికి హాజరుకాలేదు. దీంతో ఎంపీపీపై ప్రకటించిన అవిశ్వాసం వీగిపోయినట్లు ఆర్డీవో మధుసూదన్ ప్రకటించారు. గత నెల 27న ఎంపీపీపై అవిశ్వాసం ప్రకటిస్తూ మండలంలోని వరదవెల్లి, మల్లాపూర్, అనంతపల్లి, కోరెం, తడగొండ, నర్సింగాపూర్ ఎంపీటీసీలు ఈడుగు రాజేశ్వరి, ఐరెడ్డి గీత, కంకణాల వనజ, డబ్బు మమత, ఉయ్యాల శ్రీనివాస్, కొనుకటి నాగయ్య ఆర్డీవకు వినతిపత్రం ఇచ్చిన విషయం తెలిసిందే.

మండలకేంద్రంలో సంబరాలు

ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్‌పై ప్రటించిన అవిశ్వాసం వీగిపోవడంతో మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో పటాకులు కాలుస్తూ ఆయన అభిమానులు, యువకులు సంబరాలు నిర్వహించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.

'మహా' జాతరకు తాత్కాలిక రోడ్డు మరమ్మతులు

చందుర్తి(వేములవాడ): చందుర్తి–మోతుకులరావుపేట గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో నిలిచిన రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నాయకులకు ఆదేశాలు జారీచేశారు. మార్చి 8న జరిగే వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి మహాశివ రాత్రి జాతరకు వచ్చే మేడిపల్లి, భీమారం మండలాల భక్తులకు దూరభారం తగ్గించేందుకు నిలిచిన మూడున్నర కిలోమీటర్ల రోడ్డు పనులకు నాయకులు బుధవారం మొరం పోయించి చదును చేయిస్తున్నారు. తాత్కాలిక రోడ్డు మరమ్మతలతో జాతరకు వచ్చే భక్తుల దూరభారం తగ్గుతుందని నాయకులు భావిస్తున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, నాయకులు పులి సత్తయ్య,నేవూరి శంకర్‌రెడ్డి తదితరులు పరిశీలించారు.



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న నాయకులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేములవాడ : వేమహాశివరాత్రి జాతర సందర్భంగా పట్టణంలో విద్యుత్ మరమ్మతుల కారణంగా చెక్కపల్లి రోడ్, భగవంతరావునగర్, కాలేజీరోడ్డు, శ్యామకుంట, బద్దిపోచమ్మ ఏరియా, టెంపుల్ ఏరియా, కట్టుకాల్వ, కోరుట్ల బస్టాప్, మల్లారం రోడ్, సాయినగర్, మార్కండేయనగర్ గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ఏఈ సిద్దార్థ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెస్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చెరువు కట్టపై వెళ్లేదెలా ?

గంభీరావుపేట: మండలకేంద్రంలోని గంగమ్మ చెరువు కట్టపై ముళ్లపొదలు అడ్డంగా పెరిగాయి. దీంతో పాదచారులు, వాహనదారులు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం చెరువు కట్టపై మహిళలు, యువకులు, వృద్ధులు ఉదయం, సాయంత్రం పూట వాకింగ్ చేస్తుంటారు. వారంతా అడ్డుగా పెరిగిన ముళ్ల పొదలతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. అధికారులు స్పందించి కట్టపై అడ్డంగా ఉన్న చెట్లను తొలగించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



షార్ట్‌సర్క్యూట్‌తో మామిడితోట దగ్ధం

- మరమ్మతులో ఫైర్ వాహనం
- స్పందించని విద్యుత్‌శాఖ అధికారులు

వేములవాడరూరల్: వేములవాడ మండలం వట్టెంల గ్రామంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మామిడి తోట దగ్ధమైంది. ఈ విషయంపై సంబంధిత రైతు ఫైర్‌స్టేషన్ అధికారులకు సమాచారం అందించగా.. వాహనం మరమ్మతులో ఉందని సమాధానం ఇచ్చారు. విద్యుత్‌శాఖ అధికారులు సైతం సకాలంలో స్పందించకపోవడంతో దాదాపు రూ.50వేల విలువైన మామిడితోట దగ్ధమైనట్లు రైతు బాలసాని మల్లేశం తెలిపారు. మామిడితోట పక్క నుంచి వెళ్తున్న విద్యుత్‌లైన్‌లో షార్ట్ సర్క్యూట్ జరిగినట్లు రైతు చెప్పారు. వేములవాడ ఫైర్‌స్టేషన్ కార్యాలయంలోని అత్యవసర ఫోన్ కొన్ని నెలలుగా పనిచేయడం లేదని తెలిసింది. ఈ విషయంపై ఫైర్ ఆఫీసర్ కమలాకర్‌ను వివరణ కోరగా మూడు రోజులుగా వాహనం మరమ్మతులో ఉందని, సిరిసిల్ల కార్యాలయానికి సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

కార్యవర్గ సభ్యులకు సన్మానం



సన్మానిస్తున్న పర్శ హన్మాండ్లు

గంభీరావుపేట: నూతనంగా ఎన్నికైన ముదిరాజ్ సంఘం మండల నూతన కార్యవర్గానికి ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్శ హన్మండ్లు బుధవారం ఘనంగా సన్మానించారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. సంఘ అభివృద్ధికి కృషి చేయాలని హన్మండ్లు సూచించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చాత్రబోయిన లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పిట్ల బాబు, సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.